క్లుప్తంగా

క్షతగాత్రుడికి బాసట



బాధితుడు నరసింహమూర్తికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్ఏఎఫ్ అధినేత సుభాష్

పెనుగొండ: పెయింటింగ్ పనిచేసుకొంటూ జీవనం సాగిస్తూ విద్యుత్ షాక్‌కు గురై రెండు చేతులూ, కాళ్లు పోగొట్టుకున్న పెనుగొండకు చెందిన వీరవల్లి నరసింహమూర్తికి జై శెట్టి బలిజ గ్రూపు అండగా నిలిచింది. ఇటీవల జరిగిన ప్రమాదంలో కాళ్లు చేతులు పోగొట్టుకోవడంతో వీరవల్లి నరసింహమూర్తి పూర్తిగా జీవనాధారం కోల్పోయి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతుంది. ఈ తరుణంలో జై శెట్టిబలిజ గ్రూపు అండగా నిలిచి గ్రూపు ద్వారా వచ్చిన విరాళాలు రూ.2,45,725లో నరసింహమూర్తి కుమార్తె భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పాప(3)కు రూ.1,80,000 బ్యాంకులో జమ చేసి, మిగిలిన రూ.65,725 బాధితుడు వీరవల్లి నరసింహమూర్తికి ఆదివారం పెనుగొండలో అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఏఎఫ్ అధినేత వాసంశెట్టి సుభాష్, మనుము సత్య కల్యాణి,వనుము గోవిందు, కట్టా వేణుగోపాల్, ఉప్పాల రాజ్ కిరణ్, కాంగ్రేకుల నరసింహమూర్తి, బాలం సత్తిరాజు, దంపనబోయిన హరి, సొల్లంగి వెంకటరమణ, బొంతు గణేష్, ఇళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఏడో సచివాలయం వద్ద జగనన్న సురక్ష

నరసాపురం: పట్టణంలోని వలవలవారివీధి ఏడో సచివాలయం వద్ద సోమవారం ఉదయం 9.30 గంటలు నుంచి 9.13,14,15 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరులకు చెప్పారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వివరించారు. ఆయా వార్డుల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఇప్పటికే సభ్యులందరికీ అజెండా కాపీలు పంపిణీ చేశామని వివరించారు. సభ్యులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు కాంబొట్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

యలమంచిలి: మండలంలోని కాంబొట్లపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పాల్గొంటారన్నారు. శిబిరంలో సీనియర్ వైద్యులు ఉంటారని, గ్రామ ప్రజలంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

సాక్షి, భీమవరం: భీమవరం ఒకటో పట్టణానికి చెందిన పి.తాతారావు (38) మృతదేహాన్ని గొల్లపాలెం సమీపంలో ఆదివారం గుర్తించామని సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. ఈనెల 9న రాత్రి ఇంటికి రాకపోవడంతో మరునాడు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, తాతారావు కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. బైపాస్ రోడ్డులోని యనమదుర్రు వంతెన పక్కన అతని ద్విచక్రవాహనం గుర్తించామన్నారు. బహిర్భూమికి వెళ్లే సమయంలో కాలు జారి యనమదుర్రు కాలువలో పడిపోయి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ ఈయూ సమావేశం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం అనంతరం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలలో ప్రధానంగా 2020 నుంచి మూడేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు, 2020 జనవరి తరువాత చనిపోయిన, రిటైర్, వీఆర్ఎస్ తీసుకున్న, మెడికల్‌గా అన్‌ఫిట్ అయిన వారి సెటిల్‌మెంట్లు సెప్టెంబర్‌లోగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. జిల్లా కార్యదర్శి అల్లం నారాయణ, జోనల్ నాయకులు ఎంఆర్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కోసం ప్రచార రథ యాత్ర

పాలకోడేరు: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు 4,200 కిలోమీటర్ల మేర ప్రచార రథయాత్ర నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా యువజన విభాగం నాయకులు షేక్ జిలాని బాషా చెప్పారు. ఆదివారం భీమవరంలోని కుముదవల్లి రోడ్డులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఉన్నాడు.. జగనన్న ఉంటాడు అనే నినాదంతో పథకాలు వివరిస్తూ మరలా జగనన్నను అధికారంలోకి తెచ్చేందుకు తాను ప్రచారం చేపట్టినట్లు వివరించారు. అనంతరం జిలాని బాషాను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఘనంగా సత్కరించారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా

- గ్రామాల్లో దసరా ఉత్సవాల ప్రారంభం
- భవానీ దీక్షాధారణ చేసిన భక్తులు



పెనుమంత్ర: నెగ్గిపూడిలో శ్రీవనుమలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లను విశేషంగా అలంకరించిన దృశ్యం



నరసాపురం: పండ మార్కెట్ వద్ద శ్రీశైలపుత్రీదేవి అలంకరణ



పెనుగొండ: శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్న పెనుగొండ వాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాత



పెనుగొండ: శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్న మహిషాసురమర్దని అమ్మవారు



పాలకొల్లు అర్బన్: బ్రాడీపేటలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి పూజలు ప్రారంభించారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద 39వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాలను వేడుకగా ప్రారంభించారు. అమ్మవారు శ్రీశైలపుత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలోముసలమ్మ అలయం వద్ద, గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: దేవిశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో పలు కూడళ్లలో అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి కలశస్థాపన చేసి పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి దేవి మండపంలో ఉదయం 8.15 గంటలకు కలశ ముహూర్తం చేసి శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభించారు. మొదటి రోజు అమ్మవారిని బాలా త్రిపురసుందరిదేవిగా అలంకరణ చేశారు. స్థానిక యడ్లబజారు సెంటర్ శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో తెల్లవారుజామున కలశస్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. స్థానిక వాసవి ఆర్యవైశ్య కల్యాణమండపంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు పురస్కరించుకుని 102 కలశాలతో మహిళలు, యువతులు వాసవి మాత ఊరేగింపు నిర్వహించారు. మొదటి రోజు బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరణ చేశారు. అలాగే పట్టణ పురవీధుల్లో యూత్ కమిటీల ఆధ్వర్యంలో స్టేజీ అలంకరణలు చేసి అమ్మవార్లను ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయాల్లో వివిధ అలంకరణల్లో ఏర్పాటుచేసిన అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆర్యవైశ్య కల్యాణమండపం అధ్యక్ష కార్యదర్శులు మామిడి వెంకటేశ్వరరావు, రేపాక ప్రవీణ్‌భాను పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ:దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, అఖిల భారత శ్రీవాసవీపెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలోనూ, శ్రీకంచికామాక్షి ఆలయంలోనూ, వడలిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోనూ, సిద్ధాంతంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలోనూ, ఇలపర్రు, ములపర్రుల్లోనూ, పెనుగొండలో రామచంద్రరావుపేట, వేంద్రవారి పేట, గుర్రాల వారి వీధి, చెరుకువాడ



పాలకొల్లు సెంట్రల్: 102 కలశాలతో వాసవి మాత ఊరేగింపు చేస్తున్న మహిళలు

ల్లోనూ కలశ పూజలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవార్లను అలంకరణల్లో తీర్చిదిద్దారు. భక్తులు కుంకుమపూజలు నిర్వహించారు.

ఆచంట మండలంలో

ఆచంటలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఆచంట రామేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు, అభిషేకంలతో ఉత్సవాలు ప్రారంభించారు. పెదమల్లం, కొడమంచిలి, పెనుమంచిలి,ఆచంట వేమవరంల్లోనూ దేవి నవరాత్రులు భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: దసర శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రతి గ్రామంలోను ప్రధాన కూడళ్లలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేశారు. భక్తులు ఉదయం, సాయంత్రం అమ్మవారి విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు గుబ్బల పురుషోత్తం బ్రహ్మత్వంలో తంగెళ్ల రాజశేఖర్ దంపతులు కుంకుమ పూజ చేశారు.

రాత్రి సమయంలో అమ్మవారిని ఏర్పాటుచేసిన పందిళ్ల వద్ద కోలాట, తాళాల భజనలు ప్రారంభించారు. పూజానంతరం ప్రసాద వితరణ చేస్తున్నారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: మండలంలో వివిధ గ్రామాలలో అమ్మవార్ల దేవాలయాల వద్ద దేవి నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. నెగ్గిపూడి గ్రామంలో శ్రీవనుమలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లకు గ్రామానికి చెందిన గుడిమెట్ల సత్తిరెడ్డి, సంతోషి దుర్గా పార్వతి దంపతులు అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువచ్చి కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.ఇల్లిందలపర్రులో శ్రీకనకదుర్గమ్మ, గోగులమ్మ ఆలయాల వద్ద ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి రాధ దంపతులు కలశస్థాపన చేశారు. నత్తారామేశ్వరంలో విజయదుర్గాదేవి, వెలగలవారిపాలెం, పెనుమంత్ర, జుత్తిగ, ఆలమూరు, మార్టేరు గ్రామాలలో కలశస్థాపన చేసి అమ్మవార్ల ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాల వద్ద విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. యడ్ల బజారులోని శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రారంభించారు. పట్టణంలోని అచ్చుగట్లపాలెం, 3, 4, 7 వార్డుల్లోనూ, అలాగే మావుళ్లమ్మపేట, చింతలతోట, సలాధివారితోట, టిడ్కో గృహాల వద్ద, కొండాలమ్మ వీధి, వీవర్స్‌కాలనీలోనూ గుడాల గోపి పాల్గొని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను దర్శించుకుని ఆయా కమిటీ సభ్యులను అభినందించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు, చింతలపూడి, దెందులూరు వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, ఆలయాల చైర్మన్‌లు కావలి శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: దేవీనవరాత్రుల సందర్భంగా ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. ఆదివారం చినమైనవానిలంక గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో ప్రత్యే పూజలు నిర్విహించారు. చిట్టవరంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు గ్రామానికి చెందిన పలువురు దంపతులు పూజలు చేశారు. కొప్పర్రు, లిఖితపూడి, తూర్పుతాళ్లు, లక్ష్మణేశ్వరం, సారవ తదితర గ్రామాల్లోని ఆలయాలతో పాటు పలు కూడళ్లలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారవ గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారికి కై ల సత్యనారాయణ, త్రిమూర్తులు కుటుంబ సభ్యులు ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



పెనుమంత్ర: వెలగలవారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ దృశ్యం



యలమంచిలి: అడవిపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు



పెనుగొండ: సిద్ధాంతం కృష్ణదేవరాయ సంఘం దసరా మండపం వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పరిశుభ్రమైన చేతులతోనే ఆరోగ్యం



యలమంచిలి: చించినాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ



పాలకొల్లు సెంట్రల్: హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యలమంచిలి: పరిశుభ్రమైన చేతులతోనే మనిషి ఆరోగ్యం సగం బాగుపడుతుందని ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా చించినాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి ఆమె చేతులు శుభ్రం చేసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేతులు శుభ్రంగా చేసుకోకుండా ఆహార పదార్థాలు తినడం వల్ల సూక్ష్మ క్రిములు శరీరంలో చేరి హాని చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో చించినాడ సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఎంఈఓ కనుమూరి వెంకట రామకృష్ణంరాజు, పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు విశ్రాంత ఎంఈఓ ముదునూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా చేతులు పరిశుభ్రతగా ఉండాలని జెసిఐ రైజింగ్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కావలి మౌని అన్నారు. ఆదివారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జేసీఐ రైసింగ్ సేవా సంస్థ ద్వారా గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌని మాట్లాడుతూ శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ద్వారా ప్రపంచంలో అనేక మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం చేతులు పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంవల్లేనని తెలిపారు. ఐక్యరాజ్యసమితి 2008లో అక్టోబర్ 15 చేతులు పరిశుభ్రత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియా అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, విద్యార్థులు, జేసీఐ సభ్యులు రేపాక మీనామణిదీప్తి, అనూష, కారుమూరి సబిత తదితరులు పాల్గొన్నారు.

7న హలో మాదిగ చలో హైదరాబాద్

పాలకొల్లు అర్బన్: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పసుపులేటి చినబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు నవంబర్ 7న హైదరాబాద్‌లో జరిగే అల్లంపురం నుంచి హైదరాబాద్ వరకు జరగనున్న మాదిగ విశ్వరూప పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం వడ్లవానిపాలెంలో పోస్టర్ విడుదల చేసిన అనంతరం చినబాబు మాట్లాడారు. విశ్వరూప మహాసభకు లక్షలాది మంది తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.జీవరత్నం, టి.రాజు, ఎస్.గాంధీ, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.నవీన్, ఎ.మురళి, ఎస్.సాయి, ఎస్.జార్జిబుష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదివే అలవాటు పెంచాలి



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న దృశ్యం

నరసాపురం: పిల్లలు పుస్తకాలు చదివే అలవాటును పెంచాలని, ఆ దిశగా తల్లితండ్రులు శ్రద్ధ చూపించాలని రిటైర్డ్ సైంటిస్ట్ రంగినీడి సుబ్బారావు సూచించారు. పట్టణంలోని గ్రేడ్–1శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల నేపథ్యంలో జిల్లా గ్రంథాలయసంస్థ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నెల 25 వరకూ జరగనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఇంటర్నెట్ కాలంలో సెల్‌ఫోన్, టీవీలకు అలవాటు పడిన విద్యార్థులు పుస్తకాలు చదవడం మరిచిపోయారన్నారు. పుస్తక పఠనం ద్వారా జీవితాల్లో ఊహించని మార్పు వస్తుందని చెప్పారు. పుస్తకాలు చదవడం ద్వారా ఎంతోమంది మన దేశంలో గొప్పవ్యక్తులు తయారయ్యారని వివరించారు. తొలిరోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా పుస్తకాలు చదవడం మాకిష్టం అనే అంశంతో పిల్లలతో కథల పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి, కొప్పర్తి విజయ్‌కుమార్, జీవన్‌కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం విషయంలో ఇరు గ్రామాల మధ్య వివాదం



ఎల్బీచర్ల గ్రామంలో శ్మశాన ఏర్పాటు విషయమై చర్చించుకుంటున్న ఇరు గ్రామాల పెద్దలు

నరసాపురం రూరల్: శ్మశాన వాటిక ఏర్పాటు స్థలంపై రెండు గ్రామాల మధ్య వివాదం తలెత్తింది. నరసాపురం మండలం ఎల్బీచర్ల, సారవగ్రామాల సరిహద్దుల్లో చినసారవకు చెందిన వ్యక్తులు శ్మశానవాటిక ఏర్పాటుకు స్థల పూడిక పనులు ఆదివారం చేపట్టారు. దీనిపై ఎల్బీచర్ల గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు గ్రామాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఎల్బీచర్ల ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా శ్మశానవాటికను ఎలా ఏర్పాటు చేస్తారంటూ నిలదీశారు. చినసారవకు చెందిన వ్యక్తులు తమ గ్రామానికి చెందిన దాత స్థలం ఇచ్చారని, పూడికకు తహసీల్దార్ అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో ఇరు గ్రామాల పెద్దలు చర్చలు జరిపి మరోసారి తహసీల్దార్ సమక్షంలో సమస్య పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేసుకుందామని అంగీకరించడంతో తాత్కాలికంగా శ్మశాన ఏర్పాటు పనులు నిలుపుదల చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ ఫాజిల్‌ను వివరణ కోరగా ఎల్బీచర్ల గ్రామ సరిహద్దు ప్రాంతంలో దాత పంచాయతీకి రాసి ఇచ్చిన జిరాయితీ స్థలంలోనే సారవ గ్రామస్తులు శ్మశానం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదే విషయమై ఇరు గ్రామాల ప్రజలతో పలుమార్లు చర్చించి పరిష్కారం చేశారన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన స్థలం కాదని ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిని పంచాయతీకి దఖలు పరిచాడని వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేడపాడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యలమంచిలి: రగ్బీ ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు మేడపాడు హైస్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని స్కూల్ హెచ్ఎం దామోదుల ప్రసాద్ తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో ఇద్దరు అండర్–17 బాలుర విభాగంలో మరొక ఇద్దరు మేడపాడు హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అండర్–14 విభాగంలో కె వరప్రసాద్, డి.ప్రసాద్ అండర్–17 బాలుర విభాగంలో జి.కల్యాణ్‌కుమార్, కె సురేంద్ర ఉన్నారన్నారు. వీరంతా నవంబర్ నెలలో కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయీ పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పీడీ రేలంగి రామకృష్ణను హెచ్ఎంతో పాటు పాఠశాల ప్రథమ సహాయకులు వేణుగోపాలాచార్యులు, స్టాఫ్ కార్యదర్శి కె.కనక చంద్రరావు అభినందించారు.

జేవీవీ జిల్లా మహాసభలు

సాక్షి, భీమవరం: జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ సమాజ ప్రగతి కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ దృక్పథంతో పనిచేయాలని కోరారు. డాక్టర్ చుండూరి సాయిబాబా, వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఎన్ రమేష్, డాక్టర్ ఎం.వీరాస్వామి, ఏకేవీ రామచంద్ర పాల్గొన్నారు.